సాక్షి నిజామాబాద్

మంగళవారం, 5, నవంబర్, 2024



ప్రజావాణికి 64 ఫిర్యాదులు

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వేగంగా పరిష్కరించాలని ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్ సూచించారు.

- 8లో ▸



లక్ష్యం దిశగా విద్యుదుత్పత్తి

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ జల విద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం దిశగా సాగుతోంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.9 /17.6

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్ల ప్రత్యేకాధికారిగా శరత్

సుభాష్‌నగర్: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారి శరత్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేకాధికారిగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్లను పర్యవేక్షించనున్నారు.

మెరుగైన సేవలందించాలి



నిజామాబాద్ నాగారం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. ఆయుష్మాన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. మాతా శిశు సేవలు, కీటక జనిత వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి తుకారాంరాథోడ్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రాం అధికారి రాజుగౌడ్, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి వినీత్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఈవోగా అశోక్

- మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్‌గా దుర్గాప్రసాద్ బదిలీ



నిజామాబాద్ అర్బన్: జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారిగా అశోక్‌ను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీఈవోగా పని చేసిన దుర్గాప్రసాద్‌ను హైదరాబాద్‌లోని మోడల్ స్కూల్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. దుర్గాప్రసాద్ సుదీర్ఘ కాలంపాటు జిల్లాలో డీఈవోగా కొనసాగారు. 2018 అక్టోబర్ 4 నుంచి 2019 అక్టోబర్ 14 వరకు ఇన్‌చార్జి డీఈవోగా పని చేశారు. అనంతరం కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు. మళ్లీ రెగ్యులర్ డీఈవోగా 2020 జూలై 20 నుంచి ఇప్పటి వరకు కొనసాగారు. బుధవారం దుర్గాప్రసాద్ రిలీవ్ కానున్నారు. నూతన డీఈవోగా నియమితులైన అశోక్ గతంలో డైట్ కళాశాలలో పని చేశారు. డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న నాగజ్యోతి నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా బదిలీ అయ్యారు.

మాజీ సర్పంచుల అరెస్టు అక్రమం

వేల్పూర్: అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్న మాజీ సర్పంచులను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేయడం అక్రమమని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. మాజీ సర్పంచులు చేసిన పనులకు చెల్లించడానికి డబ్బులు ఉండవు కానీ, బడా కాంట్రాక్టర్లయిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డిలకు డబ్బులు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉంటాయా అని ఎద్దేవా చేశారు. సర్పంచుల బిల్లులు చెల్లించడానికి డబ్బులు లేకున్నా, లక్షన్నర కోట్లతో మూసీ ప్రాజెక్టు చేపట్టడానికి రేవంత్‌రెడ్డి దగ్గర డబ్బులు ఉన్నాయన్నారు. ఇప్పటికే గ్రామాలలో అభివృద్ధి కుంటుపడిందని, పారిశుధ్య పడకేసిందన్నారు. మాజీ సర్పంచుల బకాయిలు బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రశాంత్‌రెడ్డి తీరు హాస్యాస్పదం

వేల్పూర్: బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సర్పంచుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచుల పెండింగ్ బిల్లులపై ఆయన స్పందించిన తీరు హత్య చేసినవారే సంతాపం తెలిపిన విధంగా ఉందని ఆరోపించారు. సర్పంచుల పదవీకాలం ఉన్నప్పుడు రెండేళ్లపాటు బిల్లులు చెల్లించలేదన్నారు.

మీ హయాంలో బిల్లుల కోసం ఉద్యమాలు చేసిన సర్పంచులను జైల్లో పెట్టించిన చరిత్ర మీదన్నారు. బిల్లులు ఆలస్యం కావడానికి కారుకులేవరో మాజీలు ఆలోచించాలన్నారు. వారి సమస్య కచ్చితంగా న్యాయబద్ధమైందని, వారి బిల్లులు చెల్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వానికి అప్రతిష్ట తెచ్చేవిధంగా ప్రయత్నిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ ఉచ్చులో పడరాదని సూచించారు.

దీపోత్సవం



నగరంలోని శైవక్షేత్రాలు సోమవారం శివనామ స్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం సందర్భంగా నగరంలోని శివాలయాల్లో భక్తులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవం వైభవంగా జరిపారు. పిండి దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆకాశ దీపారాధన చేశారు.





నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు

నిశిరాత్రి దాడులు!

- ఎన్‌ఐఏ దర్యాప్తులో వెల్లడైన నిషేధిత ఉగ్రసంస్థ పీఎఫ్‌ఐ శిక్షణ అంశాలు
- రెండేళ్ల క్రితం జిల్లాలో వెలుగు చూసిన ఈ సంస్థ మూలాలు
- యువకులకు మతవిద్వేషాలు నూరి పోయడం, దాడులు, హింసాత్మక ఘటనలకు పాల్పడటంపై తర్ఫీదు



జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లో రెండేళ్ల క్రితం వెలుగులోకి వచ్చిన నిషేధిత ఉగ్రవాద సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ) కార్యకలాపాలు, తీరుతెన్నులు, ఉగ్రవాదుల లక్ష్యాలకు సంబంధించి కొన్ని కొత్త విషయాలు ఇటీవల నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ) దర్యాప్తులో వెల్లడయ్యాయి. ముఖ్యంగా పీఎఫ్‌ఐ యువకులలో మత విద్వేషాలను రెచ్చగొడుతుంది. రాత్రి వేళలో విధ్వంసాలకు పాల్పడటం, ఎదుటి వారిపై దాడి చేసిన సమయంలో ఎముకలు ఎలా విరగ్గొట్టాలి. ఎదుటి వారు దాడికి పాల్పడితే ఎలా తప్పించుకుని తిరిగి దాడి చేయాలి..తదితర అంశాలు పీఎఫ్‌ఐ శిక్షణలో ఉన్నట్లు ఎన్‌ఐఏ గుర్తించింది. దేశంలో తొలిసారి పీఎఫ్‌ఐ మూలాలు జిల్లాలోనే బయటపడ్డాయి.

ఖలీల్‌వాడి: నగరంలోని 6వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి ఆటోనగర్‌లో పీఎఫ్‌ఐ శిక్షణ కేంద్రంపై పోలీసులు 2022 జూలైలో దాడులు చేశారు. ఈ స్టేషన్‌లో క్రైమ్‌నెంబర్ 141 /2022 కింద కేసు నమోదు అయ్యింది. పీఎఫ్‌ఐ శిక్షకుడు అబ్దుల్ ఖాదర్, ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు సాదుల్లాతోపాటు మరి కొంత మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం అప్పటి పోలీసు కమిషనర్ కేఆర్ నాగరాజు ఎన్‌ఐఏకు 2022 ఆగస్టులో పీఎఫ్‌ఐ ఉనికి గురించి లేఖ రాశారు. ఎన్‌ఐఏ అధికారులు జిల్లాకు వచ్చి కేసు తీవ్రతను గుర్తించి తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నగరంలోని పలు ప్రాంతాలలో పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేశారు. ఉగ్ర సంస్థ సభ్యులను హైదరాబాద్ తీసుకెళ్లి విచారించారు. మరికొంత మందికి నోటీసులు అందించారు. తర్వాత దేశవ్యాప్తంగా ఎన్‌ఐఏ దాడులు నిర్వహించింది. తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, రాజస్తాన్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్, అస్సాం, జమ్మూ, కశ్మీర్, మణిపూర్ రాష్ట్రాలలో దాడులు నిర్వహించి అనేక మందిని అరెస్ట్ చేసింది. తర్వాత కేంద్ర ప్రభుత్వం పీఎఫ్‌ఐని నిషేధించింది.

■ పీఎఫ్‌ఐ ప్రతిరోజు ప్రార్థన పేరిట యువకులకు మత విద్వేషాన్ని నూరిపోస్తుంది. మధ్యాహ్నం 2 నుంచి 2.45 గంటల మధ్య మతపరంగా రెచ్చగొట్టే వీడియోలు చూపిస్తారని ఎన్‌ఐఏ స్పష్టం చేసింది. ఉద్రేకపూర్వక ప్రసంగాలు చేస్తారు. రోజూ వార్తలు చదువుతారు. విధ్వంసకర దాడులపై చర్చిస్తారు.

పీఎఫ్‌ఐ శిక్షణ ఇలా..

- యువకులను ఆకర్షించేందుకు మొదట పీఎఫ్‌ఐ కసరత్తులపై శిక్షణ ఇస్తుంది.
- తర్వాత క్రమక్రమంగా యువతను విధ్వంసకర శక్తులుగా మార్చేందుకు ప్రత్యేక శిక్షకుల ద్వారా మోటివేషన్ క్లాసులు ఇప్పిస్తుంది.
- ప్రతి రోజు టైమ్‌టేబుల్ ప్రకారం.. ఉదయం మొదట ప్రాణాయామం, తర్వాత 11 గంటలకు శారీరక దృఢత్వాన్ని పెంచేలా వ్యాయామం ఉంటుంది.
- సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు విధ్వంసకరమైన దాడులపై శిక్షణ కొన సాగుతుంది.

ఆయుధం లేకుండా దాడి ఎలా చేయాలి

పీఎఫ్‌ఐ శిక్షణలో చేతిలో ఏ ఆయుధం లేకుండానే ఎదుటి వ్యక్తిపై ఎలా దాడిచేయాలో తర్ఫీదు ఇస్తారు. పిడిగుద్దులు, కిక్‌లతో, తలపై దాడి చేసి ఎదుటి వ్యక్తికి రక్తస్రావం అయ్యేలా చేస్తారు. అదేవిధంగా చిన్న కత్తితో ఎదుటి వ్యక్తి కడుపులో, కాళ్ల తొడలపై పొడవడంతో వ్యక్తిని కదలకుండా చేయడం, చేతికి కర్ర దొరికితే మోకాళ్లపై దాడి చేయడం, ముఖంపై కొట్టడం, కర్రతో విచక్షణారహితంగా కొట్టడం, పక్కటెముకలు విరిగేలా తన్నడం చేస్తారు. ఈ తరహా శిక్షణ యువకులకు పీఎఫ్‌ఐ ఇచ్చినట్లు ఎన్‌ఐఏ గుర్తించింది.

అన్నదాతలకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలి



శ్రద్ధానంద్ గంజ్‌లో పంట ఉత్పత్తులను పరిశీలిస్తున్న చైర్మన్ ముప్ప గంగారెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ మార్కెట్ యార్డుకు పంట తీసుకొచ్చిన ప్రతి రైతుకు గిట్టుబాటు ధర దక్కేలా చూడటమే తమ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ది మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా స్నేహ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ జంగిటి రాంచందర్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు వ్యాపారుల కొత్త లావాదేవీలను చైర్మన్ ముప్ప గంగారెడ్డి ప్రారంభించారు. శ్రద్ధానంద్ గంజ్‌లో పంట ఉత్పత్తుల క్రయావిక్రయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం కూరగాయల హోల్‌సేల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ భక్తవత్సలం, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ కిశోర్ ఇనాని, డీకేడీ రాజు, శ్రీపాద రాజు, మారుతి మల్లేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బోధన్ నుంచి శంషాబాద్

ఎయిర్‌పోర్టుకు సూపర్ లగ్జరీ బస్సు



బోధన్ బస్టాండ్‌లో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్న డీఎం శ్రీనివాస్

బోధన్: బోధన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును సోమవారం డీఎం శ్రీనివాస్ ప్రారంభించారు. పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ బస్సు బాన్సువాడ, మెదక్, జేబీఎస్, మోహిదీపట్నం మీదుగా వెళ్తుందని తెలిపారు. రోజు బోధన్ నుంచి సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి రాత్రి 12 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 5.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి ఉదయం 11.30 గంటలకు బోధన్ చేరుకుంటుందన్నారు. రెండో సూపర్ లగ్జరీ బస్సును బోధన్– కనిగిరి, పామూరుకు ప్రారంభించారు. ఈ బస్సు ప్రతి రోజు మధ్యాహ్నం 3.45 గంటలకు బోధన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు పామూరు చేరుకుంటుంది. సాయంత్రం 7 గంటలకు బయలుదేరి మరసటి రోజు ఉదయం 8.45 గంటలకు బోధన్‌కు చేరుకుంటుందని డీఎం వివరించారు. ఈ సర్వీసు సేవలను ప్ర జలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు. కార్యక్రమంలో డిపో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కరువు

- ఆర్మూర్ మున్సిపాలిటీలో మూణ్నేళ్లుగా ఏఈ, డీఈ పోస్టులు ఖాళీ
- పైప్‌లైన్ లీకేజీలను పట్టించుకునే అధికారులు లేరు



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ మున్సిపల్‌లో కార్యాలయంలోని ముఖ్యమైన ఇంజినీరింగ్ విభాగంలో ఏఈ, డీఈ అధికారులు లేకపోవడంతో పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కరువైందని, తద్వార పనుల్లో నాణ్యత లేకుండా పోతోందని విమర్శలు వస్తున్నాయి. ఇంజినీరింగ్ విభాగంలోని ఏఈ, ఇన్‌చార్జి డీఈలు మూడు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. ఇప్పటి వరకు ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాంట్రాక్టర్లు తమ పనుల గురించి అధికారుల కోసం మున్సిపల్ కార్యాలయాల్లో రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్మూర్ పట్టణంలో పలుచోట్ల పైప్ లైన్ లీకేజీతో తాగునీరు రోడ్డుపై ఏరులై పారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్ మున్సిపల్ ఏఈ గా విధులు నిర్వహించడానికి ఏ అధికారి ముందుకు రావడంలేదని తెలుస్తోంది. ముగ్గురు ఏఈలకు పోస్టింగ్ ఇచ్చినా ఎవరు కూడా ఇక్కడ పనిచేయడానికి సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల, పైప్‌లైన్ లీకేజీలపై పర్యవేక్షణ లేకపోగా, నూతన పనులకు టెండర్ ప్రతిపాదనలు పంపాలన్నా ఏఈ, డీఈలు కచ్చితంగా ఉండాల్సిందే.. ఈ కారణంగా అభివృద్ధి పనులు వాయిదా పడుతున్నాయి. ప్రస్తుతం అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న సిబ్బంది మాత్రమే మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగాన్ని నడిపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి మున్సిపల్ కార్యాలయంలో పూర్తి స్థాయిలో ఇంజినీరింగ్ ఏఈ, డీఈలను నియమించాలని పుర ప్రజలు కోరుతున్నారు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాను

ఆర్మూర్ మున్సిపల్ ఏఈ, డీఈ పోస్టుల ఖాళీల గురించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే కొత్త రిక్రుట్‌మెంట్ ఉంటుంది. రాగానే ఆర్మూర్ మున్సిపల్‌లో ఏఈలు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

విత్తనాభివృద్ధి సంస్థకు పూర్వ వైభవం తెస్తాం



మాట్లాడుతున్న సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ తదితరులు

- సమన్వయ సమావేశంలో స్పష్టం చేసిన సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్: తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థకు పూర్వ వైభవం చేకూర్చేందుకు కృషి చేస్తామని, అందుకు అన్ని వర్గాల వారు తోడ్పాటు అందించాలని ఆ సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘాల చైర్మన్లు, సీఈవోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి సీజన్‌లో విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రైతులకు ఆయా పంటల సాగుకు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు అధిక దిగుబడులు సాధించేలా నాణ్యమైన విత్తనాలు అందించాలనే లక్ష్యంతో 1976లో ప్రభుత్వం విత్తనాభివృద్ధి సంస్థను నెలకొల్పిందని గుర్తు చేశారు. అయితే గత ప్రభుత్వ నిర్లిప్త ధోరణితో గడిచిన పదేళ్ల కాలంలో విత్తనాభివృద్ధి సంస్థ తన ప్రభావాన్ని కోల్పోయిందన్నారు. ప్రైవేట్ కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయని, నకిలీ, నాసిరకం విత్తనాలతో అనేక చోట్ల రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మేలు చేకూర్చేందుకు సహకార సంఘాల ద్వారా విత్తనాభివృద్ధి సంస్థకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని నిర్ణయించామన్నారు. సంస్థ ద్వారా మేలు రకం విత్తనాలను ఉత్పత్తి చేసి, సకాలంలో రైతులకు అందించడానికి అధికారులు సహకరించాలని సూచించారు. విత్తన చట్టంలో లొసుగులు ఉండడంతో ప్రైవేట్ కంపెనీలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని చైర్మన్ అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి విత్తన చట్టంలో సమగ్ర మార్పులు తెచ్చేలా చూస్తామన్నారు. రైతులు ప్రైవేట్ కంపెనీల విత్తనాలను కొని మోసపోవద్దని, విత్తనాభివృద్ధి సంస్థ అందించే నాణ్యమైన విత్తనాలనే వినియోగించాలని కోరారు. అందరి సహకారంతో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాను సీడ్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరో టౌన్ ఎస్సై బదిలీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై మొగిలయ్య బదిలీ అయ్యారు. రెండో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది అవసరం కావడంతో బదిలీపై పంపించారు.

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా సుమన్



నిజామాబాద్ అర్బన్: టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా సుమన్ నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ మేరకు రాష్ట్ర కమిటీ నాయకులు నియామక పత్రం అందించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా పెద్దోళ్ల నాగరాజును నియమించారు. సుమన్ వ్యవసాయ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నాగరాజు గతంలో టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి మ్యాచ్‌లో నిజామాబాద్ గెలుపు



నిజామాబాద్ నాగారం: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో జరుగుతున్న అండర్–23 టోర్నమెంట్‌లో నిజామాబాద్ జట్టు మొదటి మ్యాచ్‌లో కరీంనగర్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచిన కరీంనగర్ జట్టు మొదట 39.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జిల్లా జట్టు 30 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. జస్ప్రీత్‌రెడ్డి 56, హర్షవర్ధన్ 41 పరుగులతో రాణించారు. క్రీడాకారులను క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి అభినందించారు. జిల్లా జట్టు మంగళవారం మెదక్ జట్టుతో తలపడనుంది.

స.హ. చట్టానికి తూట్లు

నిజామాబాద్ నాగారం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అధికారులు సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. సమాచారం అడిగిన వ్యక్తిని రెండేళ్లుగా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో అద్దె వాహనాలు ఎన్ని ఉన్నాయి, వాటి వివరాలను తెలపాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సమీర్ హైమద్ ఆర్టీఐ కింద 2022లో దరఖాస్తు చేశారు. ఎన్నిసార్లు కార్యాలయానికి వెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా 2024 మేలో తప్పుడు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై డీఎంహెచ్‌వో రాజశ్రీని వివరణ కోరగా ఆర్టీఐకి సంబంధించిన ఫైల్ తన దగ్గరకు రాలేదన్నారు. దరఖాస్తుదారుడు తనకు వాట్సాప్ పెట్టారని, పరిశీలిస్తానని చెప్పారు.

లక్ష్యం దిశగా విద్యుదుత్పత్తి!

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం టార్గెట్ 62 మిలియన్ యూనిట్లు
- ఇప్పటికే 45.19 మి.యూనిట్ల ఉత్పత్తి



జల విద్యుత్ కేంద్రంలో టర్బయిన్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల జల విద్యుత్ కేంద్రంలో కరెంట్ ఉత్పత్తి లక్ష్యం దిశగా సాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 62 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని విద్యుత్ సౌధ లక్ష్యం విధించింది. ఇప్పటి వరకు కేంద్రంలో 45.19 మిలియన్ యూనిట్ల కరెంట్ తయారు చేశారు. ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా 2800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండటంతో ఒక్క టర్బయిన్ ద్వారా 9 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి అవుతోంది. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల ఆధారంగా కేంద్రంలో విద్యుదుత్పత్తి జరుగుతుంది. ఒక్కో టర్బయిన్ ద్వారా 9 మెగావాట్లు ఉత్పత్తి చేయవచ్చు. పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు కరెంట్ తయారు చేయాలంటే ఒక్కో టర్బయిన్‌కు 2,200 క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుంది. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను ఆగస్టులో ప్రారంభించారు. అప్పటి నుంచి విద్యుదుత్పత్తి అధికంగా జరిగింది. వచ్చే యాసంగి సీజన్‌లో కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను చేపడుతారు. దీంతో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం చేరడం పెద్ద కష్టం కాదని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

లక్ష్యం తగ్గించిన అధికారులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని జల విద్యుత్ సౌధ అధికారులు తగ్గించారు. గతేడాది 75 మిలియన్ యూనిట్లు ఉండగా ప్రస్తుత సంవత్సరం 62 మిలియన్ యూనిట్ల లక్ష్యం కేటాయించారు. గతంలో 90 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా విధించేవారు. కానీ ఎగువ నుంచి వరద నీరు తగ్గుముఖం పడుతుండటంతో అధికారులు ఏటేటా లక్ష్యాన్ని కుదిస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా నీటి అవసరం లేని సమయంలో ఎస్కేప్ గేట్ల ద్వారా నీరు వదిలి విద్యుత్ ఉత్పత్తి చేశారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం

ప్రాజెక్ట్ వద్ద గల జల విద్యుత్ కేంద్రంలో ప్రస్తుత సంవత్సరం 62 మిలియన్ యూనిట్ల లక్ష్యం విధించారు. ఇప్పటి వరకు 45.19 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. మరి కొద్ది రోజుల్లో లక్ష్యం చేరుకుంటాం.

– శ్రీనివాస్, డీఈఈ, జెన్‌కో

తేమ, తూకం యంత్రాల్లో తేడాలపై ఆగ్రహం



అంతంపల్లిలో విండో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

భిక్కనూరు: కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న తేమను కొలిచే యంత్రం, తూకం యంత్రంలో తేడాలు ఉన్నాయని, అవి తప్పు చూపిస్తున్నాయంటూ మండలంలోని అంతంపల్లి సింగిల్ విండో వద్ద రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యాన్ని ఆరబోసినప్పటికీ రెండు నుంచి ఐదు శాతం వరకు తేమను ఎక్కువ చూపిస్తున్నాయని దీని వల్ల రైతులు మరింతగా ఎండబెట్టవలసి వస్తుందని సోమవారం రైతులు వాపోయారు. అలాగే తూకం యంత్రంలో కూడా 20 కిలోలకు వంద గ్రాముల తక్కువ చూపిస్తుందని దీని వల్ల రైతుకు నష్టం వాటిల్లుతుందంటూ రైతులు సింగిల్‌విండో వద్దకు వచ్చి నిరసన తెలిపారు. విండో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వ్యవసాయ అధికారులు హుటాహుటిన వచ్చి రైతులతో మాట్లాడారు. తేమ యంత్రం సరిగా పనిచేయడం లేదని గుర్తించి కొత్త తేమ యంత్రాన్ని అందజేశారు. అలాగే తూకం యంత్రంలో వంద గ్రాముల కంటే ఎక్కువ ధాన్యాన్ని పోయవద్దని అధికారులు విండో సిబ్బందికి సూచించారు. తూకంలో మోసం జరుగకుండా చూడాలని రైతులు అధికారులను కోరారు. అనంతరం రైతులు శాంతించి ఆందోళనను విరమించారు.

ట్రాన్స్‌కో ఎంప్లాయీస్ 1104 కార్యవర్గం ఎన్నిక



సుభాష్‌నగర్: నగరంలోని వర్ని చౌరస్తాలోగల విద్యుత్ కార్మిక భవన్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ఉమ్మడి జిల్లా పూర్తి స్థాయి కార్యవర్గాన్ని అధ్యక్షుడు ఎం తులసీరాం, ప్రధానకార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. రీజినల్ అధ్యక్షుడిగా రాజేందర్ ప్రసాద్, సెక్రెటరీగా ఎస్ గోపికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భానుప్రకాశ్, అడిషనల్ సెక్రెటరీలుగా కృష్ణకుమార్, గౌతమి, ఉపాధ్యక్షులుగా స్వప్న, రాజు, మహిపాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా శ్రీధర్‌రెడ్డి, కోశాధికారిగా నర్సింలు ఎన్నికయ్యారు. అనంతరం వారిని అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, నాయకులు అభినందించారు. కార్యక్రమంలో ట్రాన్స్ కో వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, అదనపు కార్యదర్శి రాంచంద్ర, ఎన్పీడీసీఎల్ డిస్కం ప్రెసిడెంట్ రఘునందన్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 64 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ట్రెయినీ ఐఏఎస్ సంకేత్ కుమార్, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 64 ఫిర్యాదులు అందాయి. ట్రెయినీ కలెక్టర్‌తో పాటు మెప్మా పీడీ రాజేందర్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

పట్టాలు ఇప్పించాలని వినతి

మాధవనగర్ కెనల్ కట్ట పరిధిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న తమకు పట్టాలు ఇప్పించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పలువురు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 80 కుటుంబాలు 25 ఏళ్ల నుంచి అక్కడ నివాసం ఉంటున్నట్లు తెలిపారు. గుడిసెలకు సంబంధించి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. మారుతి, మల్లేష్, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేయండి



ఇటీవల డీఎస్సీ నియామకాల్లో మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేయాలని పలువురు డీఎస్సీ అభ్యర్థులు వినతిపత్రం అందించారు. డీఎస్సీలో తాము 1:3లో ఎంపికై, ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు చెప్పారు. భర్తీ కాని పోస్టుల్లో తమను నియమించాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న మద్ది చంద్రకాంత్ రెడ్డి

దోమకొండ/భిక్కనూరు/బీబీపేట: గ్రంథాలయాల్లో చదువుకుని యువత ఉన్నత ఉద్యోగాలు సాధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం దోమకొండ, భిక్కనూరు, బీబీపేట మండలాల పరిధిలోని గ్రంథాలయాలను కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ తదితరులతో కలిసి సందర్శించారు. గ్రంథాలయాల్లోని సమస్యలను తెలుసుకున్నారు. పుస్తకాలు లేవని, టాయిలెట్లు మరమ్మతులు చేయించాలని పాఠకులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అలాగే గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాయలంలో కొత్త సిలబస్ పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరారు. స్పందించిన ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా మార్చేందుకు కృషి చేస్తానని అన్నారు.

ప్రతి గ్రంథాలయానికి ఇంటర్నెట్

సొంత నిధులతో కామారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రంథాలయానికి ఇంటర్నెట్ కనెక్షన్‌తో పాటు వైఫై సౌకర్యం ఏర్పాటు చేస్తానని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ హామీ ఇచ్చారు. రాజకీయాలకతీతంగా రిటైర్డ్ ఉద్యోగులు, రచయితలు, మేధావులు గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రతి గ్రంథాలయంలో మరుగుదొడ్లతో పాటు మౌలిక వసతులు వెంటనే షబ్బీర్ అలీ ఫౌండేషన్ ద్వారా సమకూర్చుతామన్నారు. గ్రంథాలయానికి తన వంతు విరాళంగా పుస్తకాల కోసం రూ.15 వేలు అందించనున్నట్లు తెలిపారు. గ్రంథాలయంలో పుస్తకాల కోసం పలువురు దాతలు వెంటనే స్పందించి విరాళాలు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ రూ.15 వేలు, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య రూ.10 వేలు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి రూ.10వేలు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్ రూ.10 వేల చొప్పున విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరెడ్డి, భూంరెడ్డి, పాత రాజు, సిద్దారెడ్డి, అబ్రబొయిన స్వామి ఉన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు నిరుపేదలకు రేషన్ సరుకులు సకాలంలో అందించి వారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు.

పాటలతో ఆకట్టుకుంటున్న అంధ కళాకారులు

వారికి కళ్లు లేకున్నా.. మనోధైర్యం కోల్పోకుండా పాటలతో ఆకట్టుకుంటున్నారు. నగరంలో ప్రధాన మందిరాలు, చౌరస్తాల వద్ద ముగ్గురు అంధులు పాటలు పాడుతూ యాచిస్తున్నారు. మంచిర్యాల దివ్యాంగుల పాఠశాలకు చెందిన అనిత(బెల్లంపల్లి), శంకర్(నిర్మల్), వెంకటేశ్(మంచిర్యాల) గైడ్ జ్యోతితో కలిసి నగరంలో పాటలు పాడుతూ యాచిస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలి



వీసీ యాదగిరిరావుకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని వర్సిటీ పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వీసీ యాదగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం నరేందర్, కర్క గణేశ్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వర్సిటీలో అకాడమిక్ వాతావరణం పూర్తిగా చెడిపోయిందన్నారు. తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాలని కోరారు. పైరవీకారులకు చెక్ పెట్టాలని, అక్రమ నియామకాలపై చర్యలు తీసుకోవాలని, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. యూనివర్సిటీ అన్ని క్యాంపస్‌ల్లో బయోమెట్రిక్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ అనిల్ కుమార్, అషూర్, నిఖిల్, రాజేశ్, బన్నీ పాల్గొన్నారు.

నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



నిజామాబాద్ నాగారం: కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురాం అన్నారు. సోమవారం ఆయన నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. అంబేడ్కర్ కృషితోనే 1935లో ఆర్‌బీఐ ఏర్పడిందన్నారు. నోట్లపై అంబేడ్కర్ చిత్రం ముద్రించాలని ఢిల్లీలో డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో మహాధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు మాలజీ, చక్రాల నాగమణి, పి స్వప్న, శంకరవ్వ, సక్కి విజయకుమార్, సౌడ జయరాజు, జిన్నా జనార్దన్, కళ్లెం భోజన్న, గంగప్రసాద్, జాంభవ చమార్, సతీష్ మహారాజ్, మామిడి రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్: బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, కౌన్సెలింగ్ సమన్వయకర్త నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే వారు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు.

7 నుంచి అర్సపల్లి రైల్వే గేట్ మూసివేత

ఖలీల్ వాడి: నగరంలోని అర్సపల్లి రైల్వే గేటును మూడు రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ మరమ్మతుల పనుల్లో భాగంగా గేట్లను ఈనెల 7న అర్ధరాత్రి నుంచి ఈనెల 10న రాత్రి 11 గంటల వరకు గేట్లను మూసి వేస్తారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



నవీపేట: నవీపేటలో రాంపూర్ రోడ్డు క్రాసింగ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన వాగ్రి సురేశ్(46) తన భార్య సీతతో కలిసి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ సురేశ్‌ను హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీ మార్కెట్ సమీపంలో లలిత అపార్ట్‌మెంట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మోకన్‌పల్లి శివారులో వృద్ధురాలు..

నవీపేట: నవీపేట మండలం మోకన్‌పల్లి శివారులో సోమవారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. వివరాలు.. గత నెల 26న గ్రామానికి చెందిన టేకు ముత్తెమ్మ (85) కాలకృత్యాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు గంగారాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సోమవారం గ్రామ శివారులో ఆమె మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు.

ఖతర్‌లో ముప్కాల్‌వాసి..



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన తాడురి లింబాద్రి(58) గుండెపోటుతో ఖతర్‌లో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింబాద్రి గురువారం డ్యూటీలో ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతదేహం త్వరగా ఇంటికి వచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. తొమ్మిది మందిని పట్టుకొని, వారి నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బంగారం ఇవ్వకుండా తప్పించుకోడానికి హత్య



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సదాశివనగర్: అప్పుగా తీసుకున్న బంగారం తిరిగి ఇవ్వకుండా తప్పించుకోవడానికి హత్య చేశాడో ఓ వ్యక్తి. సదాశివనగర్ మండలం లింగంపల్లి శివారులో గత నెల 30న రాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం వెల్లడించారు. లింగంపేట మండలం కోర్పోల్‌కు చెందిన గంగాధర్ గతంలో బతుకుదెరువు కోసం జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో కొన్ని రోజులు ఉన్నాడు. ఆ సమయంలో డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన కృష్ణతో పరిచయం ఏర్పడింది. 2019లో గంగాధర్ అర్గుల్ నుంచి వచ్చి దుబాయి వెళ్లాడు. దుబాయి నుంచి వచ్చిన గంగాధర్ స్వగ్రామంలో ఇల్లు కట్టుకొని బతుకుతున్నాడు. ఈ క్రమంలో మళ్లీ దుబాయి వెళ్లాలని అనుకున్నాడు. దీనికోసం కృష్ణ భార్య లావణ్య దగ్గర నాలుగు తులాల బంగారం అప్పుగా తీసుకున్నాడు. తిరిగి వచ్చాక నాలుగు తులాలకు ఆరు తులాల బంగారం ఇస్తానని వారికి చెప్పాడు. అయితే గంగాధర్ దుబాయి వెళ్లకుండా డబ్బు ఖర్చు చేశాడు. అప్పుగా తీసుకున్న బంగారం ఇవ్వకుండా తప్పించుకోవడానికి కృష్ణ, లావణ్య దంపతులను చంపాలని ప్లాన్ వేశాడు. గత నెల 30న కృష్ణను కామారెడ్డికి రప్పించాడు. ఇద్దరు కలిసి నిజాంసాగర్ చౌరస్తాలో కల్లు తాగారు. అనంతరం తాడ్వాయి మీదుగా లింగంపల్లి శివారు ప్రాంతానికి వెళ్లారు. లింగంపల్లి శివారులో డంపింగ్ యార్డు వద్ద కృష్ణ మూత్రం పోస్తుండగా తలపై బండరాయితో గంగాధర్ కొట్టాడు. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు కృష్ణ ఫోన్, ఏటీఎం కార్డులను తీసుకొని పరారయ్యాడు. కృష్ణ అకౌంట్ నుంచి రూ.40వేలు విత్‌డ్రా చేశాడు. లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కేసు ఛేదించిన సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రంజిత్, సిబ్బంది రవి, శ్రీనివాస్, వెంకట్, రాములు, యాదగిరిలను ఎస్పీ సింధుశర్మ అభినందించారు. సమావేశంలో ఏఎస్సైలు నర్సయ్య, సాగర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్డా కూలీ దారుణ హత్య



చిన్నస్వామి (ఫైల్)

ఎడపల్లి: ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామానికి చెందిన కొమిరె చిన్న స్వామి(40) దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. చిన్న స్వామి రెండేళ్లుగా నిజామాబాద్‌లో ఉంటూ అడ్డా కూలీగా జీవనం సాగిస్తున్నారు. పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి శనివారం వెళ్లిన చిన్నస్వామి సోమవారం మెదక్ జిల్లా శంకరంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శవమై కనిపించాడు. ఆయన మరో అడ్డా కూలీతో కలిసి వెళ్లాడు. చిన్నస్వామిని హత్య చేసి పెట్రోల్ పోసి కాల్చిన ఆనవాళ్లు ఉన్నాయి. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

రెండిళ్లలో చోరీ



మాచారెడ్డి: పాల్వంచ మండలం మంతన్‌దేవునిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చాట్ల రాజు ఇంటికి తాళం వేసి మాచారెడ్డి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.40 వేల నగదు, నాలుగు తులాల వెండి పట్టగొలుసులు చోరీ అయినట్లు గుర్తించాడు. అదే గ్రామానికి చెందిన నెత్తట్ల సత్తయ్య ఇంట్లో సైతం దొంగలు రూ.5 వేలు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

మాక్లూర్: కుటుంబంలో తరుచూ జరుగుతున్న గొడవలతో మనస్తాపం చెంది మండలంలోని ముల్లంగి (బి) గ్రామానికి చెందిన గంగమణి (52) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. గంగమణి కుమారుడు, కోడలు మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన గంగమణి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. మృతురాలి భర్త గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

రామారెడ్డి: బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, వరుడిపై అధికారులు పోక్సో కేసు నమోదు చేశారు. రామారెడ్డిలో గత నెల 16న బాల్య వివాహం జరిగింది. దీంతో అధికారులు సదరు బాలికను రెస్క్యూ హోంకు తరలించి విచారణ చేశారు. అనంతరం రామారెడ్డి కార్యదర్శి ఫిర్యాదు మేరకు బాల్య వివాహం జరిపిన తల్లిదండ్రులు, వివాహం చేసుకున్న శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.